నమస్తే తెలంగాణ
హైదరాబాద్
హైదరాబాద్- మేడ్చల్
I | హైదరాబాద్, శనివారం 24 మే 2025 | HYDERABAD

హుస్సేన్ సాగర్‌లో శుక్రవారం జరిగిన ఓ కార్యక్రమంలో భాగంగా సాగిన ఎస్‌డీఆర్‌ఎఫ్ విన్యాసాలు

అబ్దుల్లాపూర్ మండలం గౌరవెల్లిలో తాగునీటి కోసం అవస్థలుపడుతున్న జనం

## ధ్రువీకరణ పత్రాల జారీలో అక్రమాలు..!

సిటీబ్యూరో: నకిలీ జనన, మరణ ధ్రువీకరణలో అక్రమాలు వెలుగు చూశాయి. జీహెచ్ఎంసీ పరిధిలోని 74 హోమ్ బర్త్‌లపై గత కమిషనర్ విచారణకు ఆదేశించగా నాలుగు సర్టిఫికెట్లు నకిలీవిగా తేల్చారు. వాటిని రద్దు చేయడమే కాకుండా సంబంధిత శాఖ అధికారులపై క్రమశిక్షణ చర్యలకు సిఫారసు చేసింది. హెల్త్ అసిస్టెంట్ ఉద్యోగం తొలగింపు, సంబంధిత సర్కిళ్ల అధికారులు, బాధ్యులైన తల్లిదండ్రులు, సంతకాలు పెట్టిన వారు, నోటరీ చేసిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయనున్నారు. పోలీస్ శాఖ ద్వారా నకిలీ జనన, మరణ ధ్రువీకరణ పత్రాలను టొలిచౌకిలోని మెట్రో ఆసుపత్రి కారణమైనట్లు జీహెచ్ఎంసీకి దృష్టికి రావడంతో దాదాపు 65 జనన, 8 మరణ ధ్రువీకరణ పత్రాలు మెట్రో ఆసుపత్రి జారీ అయినట్లు తేల్చారు. వీటన్నింటినీ రద్దు చేసినట్లు చెప్పారు. సంబంధిత ఆసుపత్రి గుర్తింపు, వైద్యుని గుర్తింపు రద్దు చేయాలని సంబంధిత శాఖలకు లేఖ రాయనున్నట్లు అధికారులు తెలిపారు.

## వెయ్యి ఇస్తేనే ఆర్‌సీ

**సిటీబ్యూరో, మే 23 (నమస్తే తెలంగాణ):** డ్రైవింగ్ లైసెన్స్, ఆర్‌సీలు పొందాలంటే వాహనదారులు చుక్కలు చూస్తున్నారు. 20 నుంచి రెండు నెలల సమయం కూడా ఆలస్యమవుతుండటంతో ఏజెంట్లను ఆశ్రయించాల్సిన దుస్థితి నెలకొంది. ఇబ్రహీంపట్నం ఆర్టీఏ కార్యాలయంలో ప్రకాశ్ అనే వాహనదారుడు తన ఆర్‌సీ 20 రోజులైన రాకపోవడంతో ఒక ఏజెంట్‌ను ఆశ్రయించి రెండే రోజుల్లో ఆర్‌సీ పొందినట్టు తెలిపాడు. ఇప్పటికే ఆర్టీఏ కార్యాలయాల్లో దళారుల బెడద లేకుండా చేయాలని ఆర్టీఏ ఉన్నతాధికారులు అన్నీ ఆర్టీఓ కార్యాలయాల్లో ఏఐ కెమెరాలతో నిఘా పెట్టాలని భావించారు. ఖైరతాబాద్ ఆర్టీఓ కార్యాలయంలో ఏఐ కెమెరాలు ఏర్పాటు చేశారు. కానీ ఈ కెమెరాలు అన్నీ కార్యాలయాల్లో ఏర్పాటు చేస్తామని చెప్పినా.. ఇప్పటి వరకు ఆ దిశగా అడుగులు పడటం లేదు. ఈ పరిస్థితుల్లో ఆర్టీఏ కార్యాలయాలన్నీ ఏజెంట్ల చేతుల్లోకి వెళ్లిపోతున్నాయి. ఇబ్రహీంపట్నం ఆర్టీఏలో స్మార్ట్‌కార్డుల కొరత ఉండటంతో ఏజెంట్లు ఇదే అవకాశంగా మలుచుకుంటున్నారు. వెంటనే ఆర్‌సీ, లైసెన్స్‌లు ఇప్పిస్తామని ఆర్‌సీకి వెయ్యి, లైసెన్స్‌కు రూ. 1500.. ఇలా రేట్లు ఫిక్స్ చేసి ఏజెంట్లే సేవలందిస్తున్నారు.

విస్తరణకు నోచుకోనున్న జీడిమెట్ల డివిజన్ పైపులైన్ రోడ్డు మార్గం

# బీఆర్ఎస్ సంకల్పం సాకారం

## జీడిమెట్ల పైపులైన్ రోడ్డు విస్తరణకు లైన్ క్లియర్

**సిటీబ్యూరో/కుత్బుల్లాపూర్, మే 23 (నమస్తే తెలంగాణ):** బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పురుడుపోసుకున్న ప్రతిపాదనలు ఒక్కొక్కటిగా అందుబాటులోకి వస్తున్నాయి. ఎస్ఆర్‌డీపీలో భాగంగా 47 ప్రాంతాల్లో 37 చోట్ల ప్రాజెక్టు ఫలాలు అందుబాటులోకి రాగా...రెండో విడత ప్రతిపాదనలు కార్యరూపంలోకి వస్తున్నాయి. ఇందులో భాగంగానే జీడిమెట్ల 132 డివిజన్ పరిధిలో పైపులైన్ రోడ్డు మార్గం విస్తరణకు మోక్షం లభించనున్నది. ఏండ్ల తరబడి వెంటాడుతున్న ట్రాఫిక్ సమస్యకు పూర్తిగా పరిష్కారం దొరకనున్నది. గత ప్రభుత్వం బీఆర్ఎస్ పార్టీ హయాంలో పైపులైన్ రోడ్డు మార్గం విస్తరణకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. దీనికి తోడు దాదాపు రూ. 56 కోట్ల వ్యయంతో ఈ అభివృద్ధి పనులకు వచ్చే నెల 2న సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా శంకుస్థాపన చేసేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఎన్‌హెచ్- 44 జాతీయ రహదారి-నర్సాపూర్ రాష్ట్ర రహదారికి రోడ్లను కలిపే విధంగా మార్గమధ్యలో ప్రస్తుతం రెండు లైన్ల రోడ్డు ఉంది. దీనికి తోడు జీడిమెట్ల పారిశ్రామికవాడతో పాటు ఇతర ప్రాంతాలకు వెళ్లే మార్గాలకు వెళ్లాలంటే నిత్యం పెద్దపెద్ద వాహనాలతో నిత్యం రద్దీగా ఉంటుంది. దీనికి తోడు మార్గమధ్యలో ఫాక్స్‌సాగర్ చెరువు నుంచి వెళ్లే ప్రధాన నాలా ఈ మార్గం మీదుగా ఉండటంతో పైపులైన్ రోడ్డు సమీపంలో ఉన్న వంతెన సింగిల్ దారితో ఏండ్ల కిందట నిర్మించి ఉంది. దీంతో ఇక్కడి నుంచి వెళ్లే వాహనాల సంఖ్య అధికం కావడంతో కల్వర్టు వద్ద సమీపంలో నిత్యం ట్రాఫిక్ సమస్య నెలకొంటున్నది. పెరిగిన జనాభాకు అనుగుణంగా వాహనాలు, రాకపోకలు అంతేస్థాయిలో పెరుగుతూ పోతున్నాయి.

### ఎప్పుడు వరదలు వచ్చినా..

సుచిత్ర జాతీయ రహదారి నుంచి మార్గమధ్యలో ఉన్న సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీ ద్వారా జీడిమెట్ల పైపులైన్ రోడ్డు మీదుగా కుత్బుల్లాపూర్ సర్కిల్ కార్యాలయం హెచ్ఎంటీ రోడ్డు ప్రధాన రహదారికి ఈ దారీ అనుగుణంగా ఉంటుంది. నిత్యం ప్రజలతో పాటు గూడ్స్ లారీలు, ఇతర వ్యాపార సముదాయాల ట్రావెల్స్ వంటివి అనేకంగా ఇదే మార్గం గుండా రాకపోకలు సాగిస్తున్నాయి. మార్గమధ్యలో ఉన్న పైపులైన్ రోడ్డు వద్ద కల్వర్టు కేవలం రెండు లైన్ల కాలం రోడ్డు ఉండటంతో పాటుగా ఏండ్ల కిందట ఏర్పాటు చేసిన మార్గం కావడంతో పెద్దపెద్ద వాహనాలు వెళ్లే క్రమంలో ఏదైనా ప్రమాదం చోటు చేసుకునే పరిస్థితి ఉంది. ఈ క్రమంలో వాహనాలు ఒకటి లోపలికి వస్తే ఇతర వాహనాలు బయటకు వెళ్లలేని పరిస్థితి నెలకొన్నది. వర్షాలు కురిసిన ప్రతిసారి పెద్ద ఎత్తున పక్కనే ఉన్న ఫాక్స్ సాగర్, దూలపల్లి, దుండిగల్ చెరువుల నుంచి వరద నీరు అధికంగా రావడంతో పైపులైన్ రోడ్డు మార్గంలో ఉన్న కల్వర్టు నాలా పూర్తిగా నిండిపోయి దర్శనమిస్తున్నది. ఈ క్రమంలో వాహనదారులు రాకపోకలు సాగించేందుకు అనువుగా లేకుండా పోతున్నది. ఎప్పుడు వరదలు వచ్చినా ఈ మార్గం గుండా వెళ్లే ప్రధాన నాలా కల్వర్టు నిండి పొంగిపర్లే పరిస్థితి ఉంటుంది. ఇలాంటి క్రమంలో ఎప్పుడు ఏ ప్రమాదం చోటు చేసుకుంటుందో తెలియని అయోమయ పరిస్థితి. దీనికి తోడు కల్వర్టు నిర్మాణం ఏండ్ల కిందట చేపట్టడంతో పెద్ద పెద్ద వాహనాలు ఈ మార్గం మీదుగా వెళ్లే సమయంలో అతి జాగ్రత్తగా వెళ్లాల్సి ఉంటుంది. ఒకవేళ అజాగ్రత్తగా అతివేగంతో దూసుకొస్తే ఎలాంటి ప్రమాదమైన చోటు చేసుకునే అవకాశం లేక పోలేదు.

**ఫాక్స్ సాగర్ నాలాపై రూ.56 కోట్ల వ్యయంతో రహదారి విస్తరణ**

**వచ్చే నెల 2న పనులకు శంకుస్థాపన చేయనున్న ప్రభుత్వం**

### లింక్ రోడ్డును కలిపే దిశగా నిర్మాణం..

నర్సాపూర్ రాష్ట్ర రహదారితో పాటు ఎన్‌హెచ్-44 మేడ్చల్ జాతీయ రహదారి మార్గాలను కలిపే దిశంగా మార్గమధ్యలో ఉన్న జీడిమెట్ల పైపులైన్‌రోడ్డు లింక్‌రోడ్డు మార్గాన్ని కలిపేదిశగా తగు చర్యలు జరుగుతున్నాయి. దీనిలో భాగంగా ప్రస్తుతం రెండు లేన్ల విస్తరణతో ఉన్న ఈ రోడ్డును నాలుగు లేన్లకు భవిష్యత్‌లో విస్తరించే దిశగా మార్గమధ్యలో ఉన్న పైపులైన్‌రోడ్డు కల్వర్టును నాలుగు లేన్ల విస్తరణతో సుమారు రూ.56 కోట్ల వ్యయంతో కల్వర్టు విస్తరణ పనులతో పాటు అభివృద్ధి పనులు జరగనున్నాయి.

శుక్రవారం నగరంలోని ఓ హోటల్‌లో జరిగిన హెడ్ టూ హెడ్ చాలెంజ్ ఫైనల్ పోటీల్లో మిస్‌వరల్డ్ కంటెస్టంట్ల సందడి

# మళ్లీ కరోనా అలజడి

**సిటీబ్యూరో, మే 23 (నమస్తే తెలంగాణ):** మళ్లీ కరోనా మహమ్మారి మరోసారి అలజడి సృష్టిస్తోంది. ఆసియా దేశాల్లో ఇప్పటికే కలకలం సృష్టిస్తున్న వైరస్ రెండు మూడు రోజులుగా దేశంలోని వివిధ ప్రాంతాల్లో మరోసారి తన ఉనికిని చాటుతోంది. తాజాగా నగరంలోనూ ఇప్పటికే పొరుగు రాష్ట్రమైన ఏపీలోని విశాఖపట్నం, కడపలో నాలుగు కేసులు నమోద్వగా, ఢిల్లీలో ఒక్కరోజే 24 కేసులు, కేరళ 8 కేసులు నమోదైన విషయం తెలిసిందే. దేశవ్యాప్తంగా ఆయా రాష్ట్రాల్లో నమోదవుతున్న కరోనా కేసులతో అప్రమత్తమైన కేంద్ర వైద్య, ఆరోగ్య శాఖ అన్ని రాష్ట్రాలను అలర్ట్ చేసింది. ఈ మేరకు తెలంగాణ వైద్య, ఆరోగ్యశాఖ కరోనా కేసులపై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు వైద్యాధికారులు తెలిపారు. పొరుగు రాష్ట్రాల్లో నమోదవుతున్న కేసులతో పాటు నగరంలోనూ తొలి కేసు నమోదవడంతో వైద్య, ఆరోగ్యశాఖ నివారణ చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు తెలిపారు.

### అన్ని ఏర్పాట్లు..

రాష్ట్రంలో తొలి కరోనా కేసు నమోద్వడం, పొరుగు రాష్ట్రాల్లో కేసులు పెరుగుతుండడాన్ని దృష్టిలో పెట్టుకుని కేంద్ర ఆరోగ్యశాఖ మార్గదర్శకాల మేరకు గాంధీ దవాఖానలో ప్రత్యేక వార్డును ఏర్పాటు చేసినట్లు దవాఖాన సూపరింటెండెంట్ డా. రాజకుమారి వెల్లడించారు. కరోనా రోగులకు చికిత్స అందించేందుకు గాను 50 ఆక్సిజన్ పడకలతో ప్రత్యేక ఐసోలేషన్ వార్డును ఏర్పాటు చేశామన్నారు. క్లిష్టమైన కేసులకు చికిత్స అందించేందుకు ఈ వార్డులోని కొన్ని వెంటిలెటర్ పడకలు సైతం ఏర్పాటు చేశామని వెల్లడించారు.

> కూకట్‌పల్లిలో వైద్యుడికి పాజిటివ్
> దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు అప్రమత్తంగా ఉండాలి
> ఉస్మానియా మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాజారావు

### భయాందోళనలు అవసరం లేదు..

**- డా.రాజారావు, ప్రిన్సిపాల్, ఉస్మానియా వైద్య కళాశాల**

దేశంలో మళ్లీ కరోనా కేసులు నమోదవుతున్నాయి. అయితే ఇప్పుడు వచ్చే వైరస్ పెద్ద ప్రమాదం ఏమీ కాదు. ప్రజలు ఎలాంటి భయాందోళనలకు గురికావల్సిన అవసరం లేదు. కాని దీర్ఘకాలిక మిగతా IVవ పేజీలో



### వైద్యుడికి కరోనా పాజిటివ్

కూకట్‌పల్లిలోని వివేకానందనగర్‌కు చెందిన ఓ వైద్యుడికి కరోనా పాజిటివ్ నిర్ధారణ జరిగినట్లు మేడ్చల్‌జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డా.ఉమాగౌరి వెల్లడించారు. ఐదురోజులుగా సదరు డాక్టర్ ఐసోలేషన్‌లో ఉన్నట్లు వివరించారు. అతడి కుటుంబ సభ్యులు, ఇతర కాంటాక్ట్స్‌కు ఎలాంటి లక్షణాలు లేవన్నారు. ప్రస్తుతం రోగి పూర్తి ఆరోగ్యంగానే ఉన్నాడని, అతడి కుటుంబ సభ్యులు, సన్నిహితులు వైద్యాధికారుల పర్యవేక్షణలోనే ఉన్నట్లు స్పష్టం చేశారు. జిల్లాలోని అన్ని బస్తీ దవాఖానలు, పీహెచ్‌సీలు, యూపీహెచ్‌సీలు తదితర అన్ని ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాల్లో కరోనా పరీక్షలు నిర్వహిస్తున్నామని, అనుమానిత లక్షణాలు కనిపిస్తే వెంటనే స్థానిక ప్రభుత్వ ఆరోగ్య కేంద్రంలో పరీక్షలు చేయించుకోవాలని సూచించారు.

- అఫ్జల్‌గంజ్ కాల్పుల దొంగలను సిటీ ఈస్ట్‌జోన్ పోలీసులు ఇప్పటివరకు పట్టుకోలేపోయారు. ఘటన జరిగి నాలుగు నెలలు గడుస్తున్నా.. వారి ఆచూకీ కనిపెట్టలేకపోయారు. గంటల తరబడి నగరంలోనే నక్కి ఉండి..ఆ తర్వాత తిరుమలగిరి, సికింద్రాబాద్ మీదుగా ఉత్తరాది రాష్ట్రాల వైపు పారిపోయినట్లు పోలీసులను తప్పుదోవ పట్టించారు. అదే రాత్రి తిరుమలగిరి, మియాపూర్ మీదుగా ప్రైవేట్ ట్రావెల్స్‌లో చిత్తూరుకు వెళ్లినట్లు పోలీసులు గుర్తించారు. ఆ తర్వాత ఇతర రాష్ట్రాలకు వెళ్లినట్లు తేల్చారు. వారిపై గతంలో రూ. 4 లక్షల రివార్డు ఉండగా.. ఇప్పుడు దొంగల ఆచూకీ తెలిపిన వారికి హైదరాబాద్ సిటీ పోలీసులు రూ.5 లక్షల రివార్డును ప్రకటించారు.
- కాచిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో లింగంపల్లి అమ్మవారి ఆలయం సమీపంలో ని ఓ పారిశ్రామిక వేత్త ఇంట్లో చోరీకి పాల్పడి రూ.5కోట్ల సొత్తు దోచుకెళ్లిన నేపాల్ దొంగలు ఇప్పటివరకు దొరకలేదు. లుక్‌అవుట్ నోటీసులను పోలీసులు విడుదల చేశారు. నేరం జరిగిన వెంటనే రంగంలోకి దిగిన పోలీసులు దొంగల కంటే ముందుగానే ఢిల్లీ, నేపాల్ సరిహద్దుకు చేరుకున్నారు. అయినా దొంగలను పట్టుకోలేకపోయారు. నేపాల దొంగల ముఠాకు సంబంధించిన అనుమానితుల ఫొటోలను ఈస్ట్‌జోన్ పోలీసులు విడుదల చేశారు.
- మధురానగర్‌లో ఓ దొంగ పోలీసులకే మస్కాకొట్టి రెండుసార్లు పారిపోయాడు. చిన్నచిన్న దొంగతనాలే చేసినప్పటికీ రెండుసార్లు కాలనీ వాసులు అతనిని పట్టుకొని పోలీసులకు అప్పగిస్తే స్టేషన్ నుంచి అతను పరారవుతున్న పరిస్థితి పోలీసుల నిర్లక్ష్యానికి నిదర్శనంగా చెప్పాలి. తొమ్మిది నెలలుగా ఈ దొంగను పోలీసులు పట్టుకోలేకపోతున్నారని, తాము పట్టుకుని అప్పగించినా పారిపోయేలా చేశారని, అతను ఇతర దేశాలకు పారిపోయి ఉంటాడని స్థానికులు ఆరోపిస్తున్నారు.
- దోమలగూడ గగన్‌మహల్ ప్రాంతంలో రిటైర్డ్ ఉద్యోగి వద్ద కేర్‌టేకర్‌గా చేరిన యువకుడు ఏటీఎం కార్డులు తీసుకుని రూ.30 లక్షలు కాజేశాడు. బాధితులు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేసినప్పటికీ దొంగను పట్టుకోలేకపోయారు.

# ఆగని నేరాలు.. పెరిగిన చోరీలు

**సంచలన కేసుల్లో దొరకని నిందితులు**
**ఆచూకీ తెలిసినా.. పట్టుకోలేకపోతున్న ఖాకీలు**
**కేసుల ఛేదనలో వెనుకబాటు**

**సిటీబ్యూరో, మే 23 (నమస్తే తెలంగాణ):** హైదరాబాద్ పోలీస్ కమిషనరేట్ పోలీసులకు కేసులకు సంబంధించి నగరంలో సంచలనం కలిగినప్పటికీ పోలీసుల్లో మాత్రం చలనం లేదు. ఎప్పటికప్పుడు దొంగలను పట్టుకునే ప్రయత్నాలు కొనసాగిస్తున్నామని సమీక్ష సమావేశాల్లో చెబుతున్నా.. ఆ తర్వాత ఎటువంటి అడుగూ ముందుకు పడటం లేదు. ముఖ్యంగా రివార్డులు ప్రకటించడమే తప్ప చోరీలు, హంతకుల జాడ కనిపెట్టడంలో మానవ వనరుల వినియోగం తగ్గిపోయిందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఇదే సమయంలో టెక్నాలజీపై పూర్తిగా ఆధారపడటంతో దొంగలు వీరి కంటే ఆలస్యంగా తమ గమ్యస్థానాలకు చేరినప్పటికీ పోలీసులు నిందితులను పట్టుకోలేకపోయారు. హైదరాబాద్‌లో ఏటా 8 నుంచి 9వేల చోరీ కేసులు నమోదవుతున్నాయి. మిగతా IIవ పేజీలో

## వర్ష సూచన

సిటీబ్యూరో, మే 23 (నమస్తే తెలంగాణ): అల్పపీడనం ప్రభావంతో రాగల రెండు రోజులు గ్రేటర్‌లోని పలు చోట్ల తేలికపాటి నుంచి మోస్తరు, మరికొన్ని చోట్ల మోస్తరు నుంచి భారి వానలు కురిసే అవకాశాలున్నట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు. అల్పపీడనం ప్రభావంతో నగరంలో ఉష్ణోగ్రతలు సాధారణ స్థాయికి చేరుకున్నాయి. శుక్రవారం ఉదయం నుంచి రాత్రి వరకు నగరంలో గరిష్ఠం 32.2, కనిష్ఠం 23.9 డిగ్రీలు, గాలిలో తేమ 55 శాతంగా నమోదైనట్లు అధికారులు వెల్లడించారు.

సమావేశంలో పాల్గొన్న నగర సీపీ సీవీ ఆనంద్

## ఆ వీడియోలు పెడితే కఠిన చర్యలే

సిటీబ్యూరో: ఎవరైనా సోషల్ మీడియాలో పశువులను చంపుతున్నట్లు వీడియోలు పెడితే కఠిన చర్యలు తీసుకోవాలని నగర సీపీ సీవీ ఆనంద్ అధికారులను ఆదేశించారు. బక్రీద్ పండుగ నేపథ్యంలో శుక్రవారం బషీర్‌బాగ్‌లోని కాన్ఫరెన్స్‌హాల్‌లో సీపీ అధ్యక్షతన గోసేవా సంఘాలతో సమన్వయ సమావేశం జరిగింది. గోసేవా ఫౌండేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ పశువుల సంరక్షణ, గో ఆధారిత వ్యవసాయం, పశువుల నుంచి వచ్చే ఉత్పత్తులను ప్రోత్సహించడానికి తాము కృషి చేస్తున్నామని చెప్పారు. కొందరు పశువులను చంపుతున్నట్లు వీడియోలను రీల్స్‌గా తీసి సోషల్‌మీడియాలో వైరల్ చేస్తున్నారని, అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. అలా ఎవరైనా వీడియోలు పెడితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా సీపీ స్పష్టం చేశారు.